క్లుప్తంగా

వైభవంగా ఆరెమండ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల



పొన్నూరు: మండలంలోని ఆరెమండలోని ఆరెమండ్లమ్మ అమ్మవారి మందిర వార్షిక తిరునాళ్ల వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారి జాతర, మొక్కుబడులు, పొంగళ్లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆరెమండ శ్రీ గ్రామ దేవత నాట్యమండలి వారు ప్రదర్శించిన సామ్రాట్ సాంఘిక నాటకం ఆకట్టుకుంది.

నేడు యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు రూరల్: యువత, విద్యార్థుల సమస్యలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నిర్వహించనున్న యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ సోమవారం నిర్వహించనున్నట్లు పార్టీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రతి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



అప్పాపురం(కాకుమాను): సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డాక్టర్ డి.విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని అప్పాపురం, రేటూరు గ్రామాలలో ఆదివారం బాపట్ల జిల్లా డాక్టర్ ఎన్.టి.ఆర్.వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆవశ్యకతను వివరించారు. గ్రామాలలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రధాన కూడళ్లలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ కె.లావణ్య, కె.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎన్.అశోక్ రాకేష్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీని విభజన జరగకపోవడంతో విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, తెలంగాణలోనే కేంద్రీకృతమైన అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా 2024 వరకు అనేకమంది విద్యార్థులు దూర విద్య కోర్సులను అభ్యసిస్తూ వచ్చారని పేర్కొన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా పదేళ్లు పూర్తి కావడంతో ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి అక్కడి ప్రభుత్వం ఏపీ విద్యార్థులకు అడ్మిషన్లు నిలిపివేసిందని తెలిపారు. ఫలితంగా ఏపీకి చెందిన 35 వేల మంది విద్యార్థులు అడ్మిషన్ పొందలేకపోయారని, దీనికి నిరసనగా ఏపీలో అంబేడ్కర్ వర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత కచేరి

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ కళావేదికపై శ్రీ త్యాగరాజ సాంస్కృతి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసులు కొరిడే సుధీర్‌శర్మ శాస్త్రీయ సంగీత కచేరి వీనుల విందుగా జరిగింది. వయోలిన్‌పై ఎస్.జనార్దన్(చెన్నై), మృదంగంపై పి.జయభాస్కర్, ఘటంపై ఎం.చంద్రకాంత్ (హైదారాబాద్) వాయిద్యాన్ని అందించారు. శ్రీత్యాగరాజ స్వామి, వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా ఆలపించగా, సంగీతాభిమానులను అలరించాయి. సంఘ కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్, ఉపాధ్యక్షులు గిరిజాశంకర్ కళాకారులను సత్కరించారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 0863-2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అర్జీలు.. అందని పరిష్కారం..

- నాన్చుడి ధోరణిలో రెవెన్యూ అధికారులు
- నెలల తరబడి పరిష్కారానికి నోచుకోని గ్రీవెన్స్ అర్జీలు
- ఫోన్ కోసం ఎదురుచూపులు.. కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- పొన్నూరు తహసీల్దార్ కార్యాలయం పరిస్థితి

'రెండు నెలల క్రితం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కసుక్రర్రు గ్రామంలోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కొత్తగూడేనికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగి అర్జీ అందజేశారు. అర్జీని స్వీకరించిన అధికారి మీరెళ్లండి.. పరిశీలించి ఫోన్ చేస్తాం అనడంతో వెళ్లిపోయారు. ఎన్నాళ్లు ఎదురుచూసినా ఆ ఉద్యోగి సమస్యకు పరిష్కారం లభించలేదు.. కనీసం కార్యాలయం నుంచి ఫోన్ కూడా రాలేదు' ఇదీ బాధితుల ఆవేదన.



పొన్నూరు తహసీల్దార్ కార్యాలయం

పొన్నూరు: ఓ వైపు ఎండలు మండుతున్నా.. తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో దూర ప్రాంతాల నుంచి ఎంతో మంది పొన్నూరు తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్నారు. భూ సమస్యలు, కొత్త రేషన్ కార్డులు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, కుల, ఆదాయ సర్టిఫికెట్ వంటి పలు సమస్యలతో అర్జీలు అందజేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారం లభించలేదంటూ పలువురు ఆరోపిస్తున్నారు. పరిశీలించి ఫోన్ చేస్తాం అని చెబుతున్నారే కానీ ఆ ఫోన్ వచ్చిన దాఖలాలు కనిపించడం లేదని అర్జీదారులు చెబుతున్నారు. ఇక్కడ అధికారులు వినతులు తీసుకుంటున్నా మళ్లీ మళ్లీ రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా స్వీకరించిన అర్జీకి నిర్ణయించిన గడువు తీరే సమయానికి పలు కారణాలు సృష్టిస్తూ ఆన్‌లైన్‌లో రిజెక్ట్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. మళ్లీ మళ్లీ అర్జీల దాఖలుతో తీవ్ర జాప్యం చేయడంతో సమస్యను బట్టి వెలకడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. చిన్న సమస్యల పరిష్కారం కోసం కూడా అర్జీదారులు కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి నెలకొంటోంది. అర్జీలకు పరిష్కారం చివరికి కంప్యూటర్ ఆపరేటర్‌పైనే ఆధారపడి ఉందనేది గమనార్హం.

– అన్నదాతలకు తీరని భూ సమస్యల వేదికగా రెవెన్యూ శాఖ మారింది. రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని గతేడాది డిసెంబర్ 8 నుంచి ఈ ఏడాది జనవరి 10 వరకు కూటమి ప్రభుత్వం నిర్వహించిన సదస్సుల్లో వందల సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. సలు గ్రామాల్లో అర్జీల కన్నా, వీఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్‌పైనే ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. ప్రభుత్వానికి లెక్కలు చూపించేందుకు పరిష్కారానికి అనుకూలంగా ఉన్న అర్జీలనే స్వీకరించినట్లు, అపరిష్కృతంగా ఉన్న అర్జీలను పలు కారణాలతో తిరస్కరించినట్లు పలువురు అర్జీదారులు చెబుతున్నారు.. ఎక్కువ సంఖ్యలో సర్వే సమస్యలే వచ్చాయి. వాటి పరిష్కారంలో నిర్లక్ష్యం ఆవహించింది. సదస్సులు ముగిసి రెండు నెలలు దాటినా ఇప్పటికీ పలువురు రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్

తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు అర్జీలను అందజేయాలని కోరారు.

12న విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈమని అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

లక్ష్మీపురం: ఉపాధి హామీ చట్టం రక్షణ-వ్యవసాయ కార్మికుల డిమాండ్ సాధన కోసం మార్చి 12వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని జిల్లా సంఘ కార్యాలయంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలకు ఉపయోగకరంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ బడ్జెట్లో నిధులు తగ్గించిందని తెలిపారు. ఉపాధి హామీలో యంత్రాలు, కాంట్రాక్ట్ విధాన రద్దు చేయాలని, వ్యవసాయానికి అనుసంధానం చేయరాదని, అవినీతిని అరికట్టాలని, మస్టర్లను ఉపాధి సిబ్బందికి మాత్రమే ఇవ్వాలని, ఉపాధి పనుల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని డిమాండ్ చేశారు. వలస కార్మికులకు గుర్తింపు కార్డు ఇచ్చి ఉచిత రవాణా సౌకర్యం, బియ్యం, గ్యాస్ బండ అందించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్ బి.కోటేశ్వరి, మంగళగిరి మండల అధ్యక్షులు జి.అజయ్, నాయకులు వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

కష్టపడితే ఉన్నత స్థానాలు చేరుకోవచ్చు



నగరంపాలెం: విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చునని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, డాక్టర్ ఆతుకూరి వీరరాఘవరావు అన్నారు. దోగిపర్తి సుబ్బారావు జయంతి సందర్భంగా బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోని ధ్యాన మందిరం హాల్‌లో ఆదివారం సుమారు 100 మందికి పైగా విద్యార్థులకు ఉపకార వేతనాలు, యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో శిక్షణ పూర్తి చేసుకున్న 20 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులు మస్తానయ్య, వీరరాఘవ రావు మాట్లాడుతూ ఇటువంటి స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు నిర్వర్తించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో దోగిపర్తి సాంబశివరావు, శివమోహనరావు, సుబ్బారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నరాల వ్యాధులపై అవగాహన ఉండాలి

ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ నీరజ



మాట్లాడుతున్న న్యూరాలజిస్ట్

లక్ష్మీపురం: నరాలకు సంబంధించిన సమస్యలలో ప్రధానంగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మానసిక, శారీరకంగా ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని ప్రముఖ న్యూరాలజిస్ట్ కె.నీరజ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మూతి వంకర పోవడం ఒక వైపు చెయ్యి కాలు తిమ్మిర్లు, పడిపోవడం రావడం లాంటి లక్షణాలను గమనిస్తే వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రదించాల్సిందిగా సూచించారు. కాలయాపన చేసినకొద్దీ సమస్య జటిలం అవుతుందన్నారు. 40 ఏళ్ల పైబడిన వారు ఎవరైనా మధుమేహం, రక్తపోటు లేకున్నప్పటికీ సంవత్సరానికి ఒకసారి మధుమేహం, రక్తపోటు పరీక్ష చేయించుకుంటే మంచిదని తెలిపారు. అనంతరం సంస్థ సభ్యులు డాక్టర్ కె.నీరజను ఘనంగా సత్కరించారు. ఆరోగ్యసభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా విశ్రాంత టెలికాం అధికారి వి.రామిరెడ్డి, వాణిజ్యవేత్త కె.కె. నాయుడు ఆరోగ్య విషయాలపై ప్రసంగించారు.

వైభవంగా శ్రీధైర్యలక్ష్మీ నారాయణుల కల్యాణం



నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4/2వ అడ్డ రోడ్డులోని శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో నిర్వహిస్తోన్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం కొనసాగాయి. గోపూజ, గణపతి పూజ, శ్రీచక్రమేరుకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కల్యాణాల్లో భాగంగా ఎనిమిది కళల్లోని మూడో కళ శ్రీధైర్యలక్ష్మీ నారాయణుల కల్యాణం కనుల పండువగా జరిగింది. మహాహారతి, మంత్రపుష్పం అనంతరం దంపతులకు, భక్తులకు తీర్థప్రసాద, అన్నప్రసాద వితరణ చేశారు. ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్, ధర్మకర్త మర్రిపాటి పార్థసారధి మాట్లాడుతూ ప్రతి రోజు సాయంత్రం కుంకుమార్చనలు, పారాయణాలు విశేషంగా జరుగుతాయని అన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1,200 పైగా కేసులు పరిష్కారం

నగరంపాలెం: జిల్లా కోర్టు ఆవరణలోని కోర్టుల్లో ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 1,200 పైగా కేసులను జిల్లా పోలీసులు పరిష్కరించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లల్లో నమోదైన ఐపీసీ కేసులు – 601, ఎక్సైజ్ కేసులు – 473, స్థానిక చట్టాలకు సంబంధించి 133 కేసులను పరిష్కరించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించేందుకు పోలీస్ అధికారులు, న్యాయాధికారులతో సమన్వయం చేసిన డీసీఆర్‌బీ సీఐ –2 బి.నరసింహారావు, సహకరించిన కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో అభినందించారు.

వీనుల విందుగా భక్తి సంగీతం



గానం చేస్తున్న చిన్నారులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం రాత్రి శ్రీసాయి సంగీత కళా నిలయం 16వ వార్షికోత్సవం నిర్వహించారు. సభకు అధ్యక్షుడు శ్రీహరిబాబు అధ్యక్షత వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్నారుల గానం సభికులను అలరించాయి. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తులసి గ్రూప్స్ చైర్మన్ తులసి రామచంద్రప్రభు, వికాస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ కనగాల సత్యనారాయణ, టుబాకో బోర్డు సభ్యులు కె.రమేష్‌బాబు, కళావాచస్పతి డాక్టర్ అశోక్ ఆనంద్ కొప్పుల, నత్య కళా భారతి నిర్వాహకులు ఎన్.బాలు మాట్లాడారు. చిన్నారులను, కళాకారులను అభినందించారు. అనంతరం వోకల్, కీబోర్డుపై భక్తి సంగీతాన్ని వినిపించారు. అతిథులు, కళాకారులను సంస్థ నిర్వాహకులు సత్కరించారు.

మహాయజ్ఞం పూర్ణాహుతి ప్రారంభం



108 కోట్ల శ్రీరామనామ పారాయణ పత్రికలను ప్రత్యేక వాహనంపై ఉంచి శోభాయాత్ర చేస్తున్న దృశ్యం

తెనాలి: స్థానిక శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం కేంద్రంగా అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవం ఘనంగా ఆరంభమైంది. స్థానిక తాలూకా హైస్కూలు గ్రౌండ్‌లో ఆరురోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. రాష్ట్రంలోనూ, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పూర్తిచేసిన 108 కోట్ల శ్రీరామనామ పారాయణ పత్రికలను ప్రత్యేక వాహనంపై ఉంచి శోభాయాత్రను శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుండి బయలుదేరింది. తెనాలి డీఎస్పీ బి.జనార్దన రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి జరిగే తెనాలి తాలూకా హైస్కూలు మైదానంలోని వేదిక వరకు శోభాయాత్ర సాగింది. అక్కడ సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహం, దీక్షాధారణ, అంకురారోపణను వైఖానసాగమోక్తంగా జరిపారు. సోమవారం ఉదయం ఆరుగంటలకు గోపూజతో వేడుకలు ఆరంభమవుతాయనీ, శ్రీసీతారాములకు పంచామృత స్నపన తదుపరి ఉదయం 10 గంటలకు శ్రీలక్ష్మీనారాయణ కళ్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. భక్తజనులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. 11.30కు బ్రహ్మశ్రీ డాక్టర్ నోరి నారాయణమూర్తిచే ఆధ్యాత్మిక ప్రవచనం, సాయంత్రం 6.45 గంటలకు అవధాన సరస్వతీపీఠం పీఠాధిపతి బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని వివరించారు. శోభాయాత్రలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు నిఖిల్ శాండిల్య, ఆలయ ఈవో అవుతు శ్రీనివాస్ రెడ్డి, వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ ఆర్‌వీ కిరణ్ కుమార్, కల్లూరి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

కుటుంబ బాధ్యతల్లో మహిళల పాత్ర కీలకం



నగరంపాలెం: స్థానిక నల్లచెరువులోని సువర్చలా ప్రసన్నాంజనేయ కల్యాణ మండపంలో ఆదివారం వాసవి క్లబ్ మహిళా గుంటూరు, వాసవి క్లబ్ గుంటూరు, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కుటుంబ నిర్వహణ బాధ్యతల్లో మహిళల పాత్ర మరువలేనిదని ప్రముఖ వైద్యురాలు పువ్వాడ లక్ష్మీదీపిక, మున్నలూరి రాధ అన్నారు. వాసవి క్లబ్ మహిళా పీఎస్‌టీలు రాయవరపు అనూరాధ, విజయలక్ష్మి, చంద్రిక, వాసవి క్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ పాల్గొనగా, అతిథులను సత్కరించారు.

విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలి



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కాకుమాను: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని పుస్తక పఠనం వలన మానసిక ప్రశాంతత, మేధాశక్తి పెంపొందుతుందని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం అంటే మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మోహనరావు మాట్లాడుతూ గ్రంథాలయాలకు మానవ జీవితాన్ని మార్చే అద్భుత శక్తి ఉందని విద్యార్థులతో పాటు ప్రజలు కూడా ప్రతి రోజు కొంత సమయాన్ని పస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు గారపాటి రమేష్, గ్రంథాలయ నిర్వాహకురాలు సుభాషిణి, వెలినేని శివయ్య, మేడిద రవి, ఎస్.మల్లిక, జి.మంజుల పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చలో ఢిల్లీ



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

పెదకాకాని: భవన నిర్మాణ కార్మిక సమస్యలపై చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి శ్రీరాములు అన్నారు. పెదకాకాని ఎన్‌టీఆర్ కాలనీలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. శ్రీరాములు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు ప్రమాదాలకు గురైనప్పుడు వారికి ఉచిత వైద్యం సత్వరమే అందించాలని, వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. తొలుత ఈనెల 28వ తేదిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం గుంటూరు నగర కార్యదర్శి ఉప్పు హరిబాబు, కార్యదర్శులు శెట్టిపల్లి రవి, మంజునాథ్, రామచంద్రయ్యగౌడ్, నాయుడు రాము పాల్గొన్నారు.

12 నుంచి అగస్త్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

గుంటూరు రూరల్: నల్లపాడులోని అగస్త్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు తుర్లపాటి ప్రసన్నాంజనేయశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, స్వామివారిని పెండ్లికుమారుడిని చేయటం, అంకురార్పణ, ధ్వజారోహణం ప్రత్యేక అలంకారంలో భక్తులకు స్వామి దర్శనం ఉంటుందని వివరించారు. 13వ తేదీన ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు, బలిహారణ, ఎదురుకోల ఉత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి ఒంటి గంటకు స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. 14న ప్రత్యేక పూజలతోపాటు స్వామి తలంబ్రాలోత్సవం, రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15వ తేదీన పూజలు, అభిషేకాలు, హోమాలతోపాటు స్వామివారి వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కావున భక్తులు స్వామి కల్యాణ మహోత్సవాలకు హాజరు కావాలని కోరారు.

ఇంటి చెత్త అని తేలికగా, చులకనగా చూడకండి



సీతారామయ్యను సన్మానిస్తున్న నిర్వాహకులు

గుంటూరు మెడికల్: ఇంటి చెత్త అని తేలికగా, చెత్తే అని చులకనగా చూడవద్దని గ్లోబల్ ఎన్విరాన్మెంటల్ ఎకాలజీ ప్రొటెక్షన్ సర్వీసెస్ సంస్థ ఫౌండర్ చెలికాని సీతారామయ్య అన్నారు. చెత్తను ఉపయోగించుకునే విధానం తెలుసుకొని సమాజానికి ఉపయోగపడే వస్తువులుగా మార్చుకోవాలని సూచించారు. ఆదివారం ఏటీ అగ్రహారం మీనాక్షి విలాస్ ప్రాంగణంలో ఇంటి వ్యర్థాల నుంచి ఎరువు తయారు చేసుకునే విధానంపై సదస్సు నిర్వహించారు. సీతారామయ్య మాట్లాడుతూ ఇంట్లో మిగిలిన కూరగాయ తొక్కులు, పళ్లతొక్కులు మొదలైన పచ్చి పదార్థాల నుంచి ఎరువు ఎలా తయారు చేసుకోవాలని కోరారు. కూరగాయలు, ఎండిన ఆకులు, మట్టి, ట్రైకోడెర్మా విరిడి, సుడోమనాస్, డీకంపోజర్ పౌడర్, పొగాకు పిండి, వేప పిండి మొదలైన పదార్థాలతో ఎలా చేసుకోవాలో వివరించారు. మన మొక్కలకి అవసరమైన ఎరువులను మనమే తయారు చేసుకొని ఆరోగ్యకరమైన ఇంటి పంటలు పండించుకోవచ్చని సూచించారు. ఇది ప్రతి ఒక్కరూ మీ ఇంటిలో తయారు చేసుకునే తేలికైన విధానమని తెలిపారు. ఆర్గానిక్ ఎరువులు తోనే పంటలు పండించండి ఆరోగ్యంగా ఉండండి అని చెప్పారు. జేకేసీ కళాశాల పీజీ కోర్సెస్ డైరెక్టర్ ఎస్ ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడటం వలన అనేకమంది రోగాల బారిన పడి మరణిస్తున్నారని వెల్లడించారు. అనేక రసాయన ఎరువుల పదార్థాలను ప్రభుత్వాలు కూడా నిషేధించాయని తెలిపారు. అయినా దొంగ చాటుగా తీసుకువచ్చి వాటిని పంటల మీద వాడి వారి ఆరోగ్యం, సమాజ పౌరుల ఆరోగ్యం కూడా చెడగొట్టేలా చేస్తున్నట్లు చెప్పారు. రైతులు కూడా ఆర్గానిక్ విధానాలు పాటించి మంచి పంటలు పండించాలని కోరారు. వాకర్స్ గవర్నర్ పెద్ది శివరాం ప్రసాద్ మాట్లాడుతూ మిద్దె తోట సాగుదారులను ప్రభుత్వం కూడా ప్రోత్సహించి వారికి గార్డెన్ వస్తువులు సబ్సిడీ రేటు మీద అందజేయాలని కోరారు. సమాజమంతా ఆరోగ్యంగా ఉండటానికి ప్రభుత్వాలు కూడా సహకరించాలని సూచించారు. 35 ఏళ్లుగా పర్యావరణ, అనేక సేవారంగాల్లో సేవకునిగా రాణిస్తున్న సీతారామయ్యను స్థానికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శిష్టా శ్రీనివాసమూర్తి, గుడివాడ జోత్స్న, శివ శంకర్ రావు, మంగయ్య, చంద్రశేఖర్ రెడ్డి, సన్నీ డియోల్, చంద్రశేఖర్, పద్మజా రెడ్డి, పద్మజ, శ్రీదేవి, కారంశెట్టి మురళీకృష్ణ, యోగయ్య, జె శ్రీలత, విత్తనాల ప్రకాష్ పాల్గొన్నారు.

డాక్టర్ సుబ్రహ్మణ్యంకు 'వైద్యసేవారత్న' బిరుదు



డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యం దంపతులకు సత్కారం

తెనాలి: పట్టణానికి చెందిన ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ముత్యంశెట్టిపాలెంలోని కళ్యాణమండపంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన వైద్యశిబిరంలో డాక్టర్ కటకం పురుషోత్తమరావు పర్యవేక్షణలో తెనాలి, గుంటూరు, విజయవాడకు చెందిన స్పెషలిస్టు వైద్యులు చిన్నపిల్లలు, గర్భిణీస్త్రీలు, కీళ్లనొప్పులు, శ్వాసకోశ సమస్యలు, చర్మ సమస్యలకు రోగులను వందమందిని పరీక్షించి మందులను ఉచితంగా ఇచ్చారు. అవసరమైనవారికి రక్తపరీక్షలు, దంత పరీక్షలకు స్పాట్ ఎక్స్‌రే, శ్వాసకోశ సమస్యలకు ఎండోస్కోపీతో పరీక్షలు చేశారు. వైద్య శిబిరం ముగిసిన అనంతరం ఏర్పాటైన సభలో పేదల డాక్టరుగా గుర్తింపును పొందిన ప్రముఖ వైద్యుడు, విశ్రాంత అడిషనల్ డైరెక్టర్, ఎంపీఎంహెచ్ఎస్ డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు 'వైద్యసేవారత్న' బిరుదును ప్రదానం చేశారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించారు. మానవత సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జె.హనుమంతరావు, డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద, డాక్టర్ తాడిబోయిన మస్తానమ్మ, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ కె.పురుషోత్తమరావు చేతులమీదుగా వీరిని సత్కరించారు. వైద్యశిబిరంలో సేవలందించిన డాక్టర్లు గుత్తి కోటేశ్వరప్రసాద్, ఆర్.నవీన్, గుత్తి సుధారాణి, కె.నాగరాజు, దివి చైతన్య, ఆర్.శ్రుతి, కె.హిమజ, శ్రీనిధి, పవన్ కుమార్‌ను సత్కరించి. జ్ఞాపికలను బహూకరించారు. సొసైటీ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి గంజి శివభుజంగ ప్రభాకరరావు, కటకం వెంకట ప్రసాద్, కోశాధికారి దివి పురుషోత్తమ్, గౌరవాధ్యక్షుడు రాచాబత్తుని బ్రహ్మం, కార్యనిర్వహణ కార్యదర్శి పంచుమర్తి భాస్కరరావు, అక్కల శ్రీరామ్, జొన్నాదుల మహేష్, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.